JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి I శనివారం 04-10-2025
Medchal - Malkajgiri I Saturday 04-10-2025
jayabherinews
సంపుటి : 02 I సంచిక : 128 I పేజీలు : 8 I వెల : 5
Vol. 02 I Issue 128 I Pages : 8 I ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com



## ప్రపంచ దేశాలకు భారత్ దారిచూపుతోంది

● బిల్ గేట్స్




**జయభేరి, న్యూఢిల్లీ, అక్టోబరు 3:**

మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు, ప్రపంచ కుబేరుల్లో ఒకరైన బిల్ గేట్స్ భారత్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. ఆవిష్కరణల రంగంలో భారత్ ఒక ప్రపంచ స్థాయి నాయకుడిగా నిలుస్తోందని, అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలకు మార్గదర్శకంగా ఉందని ఆయన కొనియాడారు. భారత పరిష్కారాలు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది జీవితాలను మెరుగుపరిచే శక్తిని కలిగి ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.అమెరికాలోని సియాటిల్‌లో భారత కాన్సులేట్ జనరల్, బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్

...మిగతాది 2 లో


## పాకిస్తాన్ కు రాజ్ నాధ్ వార్నింగ్



**జయభేరి, హైదరాబాద్. అక్టోబరు 3:**

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్తాన్‌కు గట్టి హెచ్చరిక జారీ చేశారు. చొరబాట్లకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. గుజరాత్ భూజ్ సరిహద్దులో సైనికులతో కలిసి దసరా వేడుకల్లో భాగంగా ఆయుధ పూజలో పాల్గొన్న సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సింధూర్ ఇంకా అమల్లోనే ఉందని ఆయన పునరుద్ఘాటించారు. సరిహద్దుల్లో తోక జాడిస్తున్న పాకిస్తాన్‌కు భారత రక్షణ మంత్రి మరోసారి సర్జికల్ స్ట్రైక్స్ తప్పవని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. సర్ క్రీక్ ప్రాంతాన్ని తాకాలని చూస్తే తగిన శాస్తి తప్పదని పాకిస్తాన్‌ను గట్టిగా హెచ్చరించారు. సర్ క్రీక్ వైపు కన్నెత్తి చూస్తే చారిత్రకంగా, భౌగోళికంగా పాకిస్తాన్‌ను నామరూపాలు లేకుండా చేసేందుకు భారత ఆర్మీకి ఎంతో సమయం పట్టదని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

## ఉత్తరాంధ్ర వానలపై సీఎం చంద్రబాబు సమీక్ష



**జయభేరి, విజయవాడ, అక్టోబరు 3 :**

ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు, వరద పరిస్థితులపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ తదితర జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రస్తుతం జిల్లాల్లో ఉన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పరిస్థితులను అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గొట్టా బ్యారేజ్ క్యాచ్ మెంట్లో 33 టీఎంసీలు, తోటపల్లి పరిధిలో 11 టీఎంసీలు మేర వర్షపాతం నమోదు అయ్యిందని అధికారులు తెలిపారు. గొట్టా బ్యారేజికి 1.89 లక్షల క్యూసెక్కులు, తోటపల్లికి 44 వేల క్యూసెక్కుల వరద వస్తోందని శ్రీకాకుళం కలెక్టర్ తెలిపారు. ఒడిస్సాల్లోని ప్రాంతాల్లో పడిన భారీ వర్షాల కారణంగా వంశధారకు 1.05 లక్షల క్యూసెక్కుల నీరు వస్తోందని వివరించారు.ఇప్పటి వరకు భారీ వర్షాలు, ప్రమాదాల కారణంగా నలుగురు మృతి చెందినట్లు సీఎం చంద్రబాబుకు తెలిపారు అధికారులు. విశాఖ నగరం కంచరపాలెంలో ఒకరు, శ్రీకాకుళం జిల్లా

...మిగతాది 2 లో



# బీఆర్ఎస్ స్థానికల వ్యూహమిదే

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ తన సత్తాను చాటాలని యోచిస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని తమను తెలంగాణలో ఎవరూ తుడిచిపెట్టడానికి ప్రయత్నించలేరన్న బలమైన సంకేతాలను ఇవ్వనుంది. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలు పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి.

**జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 3:**

పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తు లేకుండా జరుగుతాయి. అదే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు మాత్రం పార్టీ గుర్తుతోనే జరగనున్నాయి. దీంతో పల్లె, పట్టణ ప్రాంతాల్లో పార్టీ పరపతి ఏ మాత్రం తగ్గలేదని నిరూపించుకోవడానికి కేటీఆర్ సిద్ధమయ్యారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలు కూడా ఫలితాలపై ప్రభావం చూపలేవన్నది జనానికి తెలియజేయాలని భావిస్తున్నారు. తన సోదరి కల్వకుంట్ల కవిత పార్టీ నేతలపై విమర్శలు చేయడంతో ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. కవిత ప్రభావం ఈ ఎన్నికల్లో ఉండకుండా ఉండేలా చూసుకోవాలని నేతలకు కేటీఆర్ ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. పార్టీ అధినేత కేసీఆర్ ఈ ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండనున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంతా తానే అయి లోకల్ ఎన్నికలను ఎదుర్కొనాలని నిర్ణయించారు. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక దగ్గర నుంచి ప్రచారం వరకూ నేతలను సమన్వయం చేసుకుంటూ వెళతానని, పార్టీ కోసం గత రెండేళ్లుగా పార్టీ కోసం బాగా పనిచేస్తున్న వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వాలని నేతలను ఆదేశించారు.మరొకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లుగా అవలంబిస్తున్న తీరును ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్ కు అనుకూలంగా మారేలా నేతలు వ్యవహరించాలని కేటీఆర్ ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కంటే కొన్ని సీట్లు అత్యధికంగా గెలిచి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత ఏంటో చెప్పాలని కేటీఆర్ నేతలకు సూచించారు. తాను జిల్లాల వారీగా పర్యటిస్తానని, మరికొన్ని జిల్లాల్లో హరీశ్ రావు కూడా పర్యటించి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని చెప్పారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు చేసిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన తీరుపై బాకీ కార్డును కేటీఆర్ విడుదల చేశారు. ఈ బాకీ కార్డు ప్రతి ఇంటికి చేరేలా చూడాలని కేటీఆర్ నిర్ణయించారు. స్థానిక సంస్థల ఎన్నికలతో ఇటు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అటు కవితను దెబ్బతీసి పార్టీ క్షేత్ర స్థాయిలో బలంగా ఉందన్న విషయాన్ని తెలియజెప్పేలా వ్యవహరించాలని కేటీఆర్ నేతలకు దిశానిర్దేశం చేశారు.

## నాంపల్లిలో అలయ్ బలయ్



**జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 3 :**

నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ప్రతి సంవత్సరం దసరా పండుగ ముగిసిన మరుసటి రోజున ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. తెలంగాణ ఉద్యమం సమయంలో రాజకీయ నాయకుల మధ్య ఐక్యతను పెంపొందించే లక్ష్యంతో దత్తాత్రేయ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అలయ్ బలయ్ కార్యక్రమానికి హాజరైన అతిథులకు దత్తాత్రేయ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సుప్రీంకోర్టు రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బీజేపీ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్, సినీ నటులు నాగార్జున, బ్రహ్మానందం, ఏపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి, సీపీఐ నేత నారాయణ, తెలంగాణ జన సమితి నేత ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత వి. హనుమంత రావు,

...మిగతాది 2 లో

## చార్మినార్ నీడలో గంజాయి బ్యాచ్ ఆగడాలు

● అడ్డొస్తే దాడులు.. పోలీసన్నలు జర చూడండి..

**జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 3:**



హైదరాబాద్‌లో గంజాయి వినియోగం పెరిగిపోతోంది. ముఖ్యంగా పాతబస్తీ, చార్మినార్ ప్రాంతాల్లో దీని ప్రభావం తీవ్రమవుతోంది. ఈ ప్రాంతాలలో గంజాయి బ్యాచ్‌లు విచ్చలవిడిగా తిరుగుతూ అరాచకం సృష్టిస్తున్నారు. గంజా తాగి.. స్థానిక ప్రజలతో పాటు వ్యాపారులను బెదిరిస్తూ.. అన్యాయంగా డబ్బులు వసూలు

...మిగతాది 2 లో



## భారీగా మద్యం అమ్మకాలు

● దసరా పండుగకు రెండు రోజుల్లో దాదాపు రూ.419 కోట్ల మద్యం అమ్మకాలు

**జయభేరి, హైదరాబాద్, అక్టోబర్ 3:**

దసరా పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు జరిగాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ ఒకటవ తేదీల్లో మందు బాబులు భారీగా మద్యం కొనుగోలు చేశారు. ఈ రెండు రోజుల్లో దాదాపు రూ.419 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. సెప్టెంబర్ 30న రూ.333 కోట్ల మద్యాన్ని మందుబాబులు కొనుగోలు చేశారని ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. అక్టోబర్ ఒకటో తేదీన రూ.86 కోట్ల మద్యం సేల్స్ జరిగినట్లు అధికారులు వెల్లడించారు. సాధారణ రోజులతో పోలిస్తే సెప్టెంబర్ 26 నుంచి మద్యం అమ్మకాలు రెట్టింపయ్యాయి.అయితే అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా మద్యం అమ్మకాలతోపాటు మాంసం దుకాణాలు కూడా బంద్ అయ్యాయి. దీని ఎఫెక్ట్ దసరా పండుగపై పడింది. అక్టోబర్ 2న గాంధీ జయంతితోపాటు దసరా పండుగ కూడా వచ్చింది. ఆ రోజు మద్యం షాపులు బంద్ నేపథ్యంలో ఒకరోజు ముందుగానే అంటే అక్టోబర్ 1వ తేదీనే వైన్ షాపుల వద్ద రద్దీ పెరిగింది. వైన్ షాపులు, లిక్కర్ మార్ట్ ముందు మందుబాబులు క్యూ కట్టిన పరిస్థితి. ఈ క్రమంలో దసరా, అక్టోబర్ 2 ఒకేరోజు వచ్చినప్పటికీ అంతకు ముందు రోజు భారీగా మద్యం విక్రయాలు జరిగాయిని ఎక్సైజ్ శాఖ వెల్లడించింది.

## భారత్‌లో పెరుగుతున్న విడాకులు

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## ప్రపంచ దేశాలకు భారత్ దారిచూపుతోంది

సంయుక్తంగా మహాత్మా గాంధీ 156వ జయంతి సందర్భంగా ఓ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి హాజరైన బిల్ గేట్స్ మాట్లాడుతూ... "ఈ రోజు భారత్ ఆవిష్కరణల్లో గ్లోబల్ లీడర్‌గా ఉంది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది జీవితాలను కాపాడి, మెరుగుపరిచే పరిష్కారాలను అందిస్తోంది. 'వికసిత భారత్ 2047' లక్ష్య సాధనలో భారత్‌తో మా భాగస్వామ్యం కొనసాగుతుందని ఆశిస్తున్నాం" అని తెలిపారు. గాంధీజీ ఆశయాలైన సమానత్వం, గౌరవం తమ ఫౌండేషన్ పనికి పునాది వంటివని గేట్స్ పేర్కొన్నారు.ఈ వేడుకల్లో భారతీయ సంస్కృతి, కళలు, సంప్రదాయ వంటకాలను ప్రదర్శించారు. వాషింగ్టన్, సియాటిల్ నగర ప్రభుత్వాల నుంచి సీనియర్ నాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదే కార్యక్రమంలో 'ప్రస్తుత ప్రపంచంలో గాంధీ విలువల ప్రాముఖ్యత' అనే అంశంపై యూఎస్ గ్లోబల్ సెక్యూరిటీ ఇన్‌స్టిట్యూట్ అధ్యక్షుడు జొనాథన్ గ్రానోఫ్ ప్రత్యేక ప్రసంగం చేశారు.అంతకుముందు, బెల్వ్యూ పబ్లిక్ లైబ్రరీ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి, సియాటిల్ సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. వాషింగ్టన్ స్టేట్ సెనేటర్ వందనా స్లాటర్ పుష్పాంజలి ఘటించారు. సియాటిల్, బెల్వ్యూ నగరాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భారతఅమెరికన్ సమాజం పాల్గొంది. ఈ సందర్భంగా చిన్నారులు గాంధీజీకి ఇష్టమైన భజన గీతాలను ఆలపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని భారత కాన్సులేట్ కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది.

## చార్మినార్ నీడలో గంజాయి బ్యాచ్

చేస్తూ రెచ్చిపోతున్నారు. హైదరాబాద్‌లో గంజాయి వినియోగం పెరిగిపోతోంది. ముఖ్యంగా పాతబస్తీ, చార్మినార్ ప్రాంతాల్లో దీని ప్రభావం తీవ్రమవుతోంది. ఈ ప్రాంతాలలో గంజాయి బ్యాచ్‌లు విచ్చలవిడిగా తిరుగుతూ అరాచకం సృష్టిస్తున్నారు. స్థానిక ప్రజలతో పాటు వ్యాపారులను బెదిరిస్తూ.. అన్యాయంగా డబ్బులు వసూలు చేస్తూ.. రెచ్చిపోతున్నారు. ఈ బ్యాచ్‌లు తమకు మామూలు డబ్బులు ఇవ్వకపోతే దాడులు చేయడం, పదేపదే బెదిరించడం, రోజూ వచ్చి వసూళ్లకు పాల్పడటం సర్వసాధారణంగా మారింది. పాతబస్తీ, చార్మినార్ ప్రాంతాల్లో గంజాయి వినియోగం రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో అక్కడి ఫుట్ పాత్ వ్యాపారులు, తోపుడు బండ్ల చిరు వ్యాపారులు.. ఈ గంజాయి బ్యాచ్‌ల ఆగడాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.రోజంతా కష్టపడి అమ్మితే వచ్చేది అంతంతమాత్రమే అని, దాన్ని కూడా గంజాయి బ్యాచ్ బెదిరించి లాక్కుంటున్నారని వ్యాపారులు వాపోతున్నారు. పోలీసులు స్పందించి రక్షించాలని కోరుతున్నారు. చార్మినార్ ప్రాంతం ప్రఖ్యాత పర్యాటక ప్రాంతం కావడంతో అక్కడికి వచ్చే పర్యాటకులు కూడా ఈ గంజాయి బ్యాచ్‌ల వేధింపులకు గురవుతున్నారు. వారి ఎదుటే రోడ్లపై గంజాయి బ్యాచ్‌లు రౌడీలుగా ప్రవర్తించడంతోపాటు.. పలు ప్రాంతాలను అడ్డాగా చేసుకుని.. వసూళ్ల కోసం గుంపులుగా కూర్చుంటున్నారు. దీంతో పర్యాటకులు భయంతో అక్కడ నిలబడలేకపోతున్నారు.ఇలాంటి వారితో చార్మినార్ పర్యాటక రంగం కూడా దెబ్బతింటోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ సంఘటనలు పర్యాటకులకు ఇబ్బంది కలిగించడమే కాకుండా చిరు వ్యాపారులకు కూడా నష్టం తెచ్చిపెడుతున్నాయి. ఇలాంటి ఘటనలు తరచూ జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. స్థానిక పోలీసు అధికారులు, ప్రభుత్వ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గంజాయి వినియోగాన్ని అరికట్టడంతో పాటు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలంటున్నారు.

## నాంపల్లిలో అలయ్ బలయ్

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, వేష భాషలు వేరైనా మనమంతా భారతీయులమనే భావనతో ముందుకు సాగుతున్నామని అన్నారు. అందరం ఐక్యంగా ఉండాలనే సదుద్దేశంతో అలయ్ బలయ్ కార్యక్రమం కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. దత్తాత్రేయ గత ఇరవై సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. కొందరు కులం, మతం, వర్గం, జాతి పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని, వారి ప్రయత్నాలు విఫలం కావడం ఖాయమని ఆయన వ్యాఖ్యానించారు.

## ఉత్తరాంధ్ర వానలపై సీఎం చంద్రబాబు సమీక్ష

మందసలో ఇద్దరు, పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో ఒకరు మృతి చెందినట్లు చెప్పుకొచ్చారు. దీనిపై స్పందించిన సీఎం బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ప్రస్తుతం ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్షం లేదని.. ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాలతో నదుల్లో వరద ఉందని అధికారులు సీఎంకు వివరించారు. భారీ వర్షాల కారణంగా కొన్ని చోట్ల చెట్లు కూలాయని.. ఇప్పటికే 90 శాతం కూలిన చెట్లను తొలగించామని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో దాదాపు 90 శాతం మేర విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్టు ఈపీడీసీఎల్ అధికారులు వెల్లడించారు. ఇవాళ సాయంత్రం లోగా అన్ని ప్రాంతాల్లోనూ విద్యుత్ పునరుద్ధరించాలని సీఎం ఆదేశించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో ఎక్కడా జాప్యం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

## ఏపీ వర్సెస్ కర్ణాటక

**ట్వీట్ వార్**



**జయభేరి, బెంగళూరు,, అక్టోబరు 3:**
ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్, కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే మధ్య ట్వీట్ వార్ నడిచింది. ఏపీని కించపరిచినట్లుగా ప్రియాంక ఖర్గే ట్వీట్ పెట్టడం వివాదాస్పమయింది. భారతదేశంలో అతి పిన్న రాష్ట్రంగా, మేము పెరుగుదలకు, ఉద్యోగాల సృష్టికి ప్రతి అవకాశాన్ని వెతుకుతున్నాం. రాష్ట్రాలు పెట్టుబడులు, ఉద్యోగాల కోసం పోటీపడితే, భారత్ సమృద్ధి చెందుతుందని నా నిజమైన నమ్మకం. అహంకారం సరి కాదన్నారు..లోకేష్ ఇలా స్పందించడానికి కారణం కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే ఏపీని కించపరుస్తూ ఓ ట్వీట్ పెట్టారు. బెంగళూరు ఆర్థిక ప్రగతి GDP 8.5% వృద్ధి, ఆస్తి మార్కెట్ 5% పెరుగుదల ఉందని.. ఆంధ్రప్రదేశ్‌ను దెబ్బతిన్న ప్రాణులు బలమైనవాటి మీద ఆధారపడి బతుకుతాయని.. "పారాసైట్" అని వ్యాఖ్యానించారు. మాథ్యూఫిలిప్ అనేవ్యక్తి బెంగళూరు ఔటర్ రింగ్ రోడ్ నుంచి నార్త్ సైడ్ ఎక్కువ ఐటీ కంపెనీలకు ప్రోత్సాహం ఇవ్వాల్సి ఉందని అన్నారు. దీనికి లోకేష్ స్పందించారు. బెంగళూరు నార్త్ సైడ్ కు సమీపంలోనే అనంతపురం ఉంటుందని.. పెట్టుబడులకు ఆహ్వానించారు. ఇదే ప్రియాంక్ ఖర్గేకు కోపం తెప్పించింది. గతంలో బ్లాక్ బక్ సీఈవో రోడ్లపై గుంతలు ఉన్నాయని రోజులో గంటల తరబడి సమయం వృధా అవుతోందని ట్వీట్ పెట్టారు. అప్పుడు కూడా నారా లోకేష్ ఆ స్టార్టప్ సీఈవోను బెంగళూరుకు ఆహ్వానించారు. స్టార్టప్ యజమానులు బ్లాక్ మెయిల్ చేస్తున్నారని డిప్యూటీ సీఎం శివకుమార్ మండిపడ్డారు. అయితే ప్రజల ఫిర్యాదులను బ్లాక్ మెయిల్గా చూడకూడదని.. సమస్యలుగా భావించి పరిష్కరించాలని లోకేష్ కౌంటర్ ఇచ్చారు.

# భారత్‌లో పెరుగుతున్న విడాకులు

**భారత్‌లో విడాకుల ట్రెండ్ భారీగా పెరుగుతోందని ఓ సర్వేలో వెల్లడైంది. ఇక విడాకులు తీసుకున్న తర్వాత పురుషులు ఎదుర్కొనే ఆర్థిక సంక్షోభంపై ఈ సర్వే సంచలన విషయాలను వెలుగులోకి తీసుకువచ్చింది. ఇక విడాకుల ఖర్చులు, విడాకుల తర్వాత భరణం చెల్లింపుల కోసం 42 శాతం మంది పురుషులు అప్పులు చేస్తున్నారని వెల్లడైంది. అదే సమయంలో పురుషులు సంపాదించే సంపాదనలో ఏటా 38 శాతం సొమ్మును.. విడాకుల తర్వాత మెయింటెనెన్స్ కింద చెల్లిస్తున్నారని ఈ సర్వేలో తేలింది.**




ఈ సర్వే ప్రకారం.. విడాకుల ఆర్థిక భారం పురుషులపైనే పడుతోందని వెల్లడించిందిమన దేశంలో రోజురోజుకూ విడాకులు తీసుకుంటున్న వారి సంఖ్య అమాంతం పెరిగిపోతుండటం తీవ్ర సంచలనంగా మారుతోంది. అయితే విడాకులు అనేది కేవలం మానసిక వేదన మాత్రమే కాకుండా.. జీవితంలో ఎదురయ్యే అతిపెద్ద ఆర్థిక సంక్షోభం అని తాజాగా నిర్వహించిన ఒక కొత్త అధ్యయనం నిరూపించింది. భారతదేశంలోని టైర్ 1, టైర్ 2 నగరాల్లో విడాకులు తీసుకున్న కొంతమందిపై ఓ సంస్థ నిర్వహించిన అధ్యయనంలో సంచలన విషయాలు బయటికి వచ్చాయి. విడాకుల తర్వాత ఒక పురుషుని ఆదాయంలో ఏడాదికి 38 శాతం భరణం , మెయింటెనెన్స్ వంటివి చెల్లించేందుకే ఖర్చు అవుతున్నట్లు వెల్లడించింది. అదే సమయంలో 42 శాతం మంది వ్యక్తులు.. విడాకుల సమయంలో చెల్లించే భరణం కోసం రుణాలు తీసుకుంటున్నట్లు తేలిందిఫైనాన్స్ మ్యాగజైన్ అనే సంస్థ భారత్‌లోని టైర్ 1, టైర్ 2 వంటి నగరాలకు చెందిన 1,258 మందిపై నిర్వహించిన 2025 సర్వే ప్రకారం.. విడాకుల ఆర్థిక భారం పూర్తిగా పురుషులపైనే పడుతోందని వెల్లడించింది. విడాకుల తర్వాత మెయింటెనెన్స్ చెల్లించేందుకు.. పురుషులు తమ వార్షిక ఆదాయంలో సగటున 38 శాతం ఖర్చు చేస్తున్నట్లు ఈ సర్వే వివరించింది. దాదాపు 49 శాతం మంది పురుషులు విడాకులకు సంబంధించిన ఖర్చుల కోసం రూ.5 లక్షల కంటే ఎక్కువ ఖర్చు చేసినట్లు వెల్లడైంది. ఇక ఇందులో మరో ఆందోళన కలిగించే విషయం ఏంటంటే.. 42 శాతం మంది పురుషులు భరణం చెల్లింపులు లేదా న్యాయ ప్రక్రియల కోసం రుణాలు తీసుకుంటున్నారని తెలిపింది.భరణం చెల్లించే పురుషుల్లో 29 శాతం మంది సెటిల్‌మెంట్ తర్వాత తమ ఆస్తుల నెట్ వర్త్ ప్రతికూలంగా మారిందని ఈ సర్వేలో వెల్లడించారు. ముందస్తు ప్రణాళిక లేకుండా ఇలాంటి విడాకుల ఖర్చులు ఉంటే.. ఆర్థికంగా చాలా సంవత్సరాలు వెనక్కి వెళ్లిపోతారని నిపుణులు హెచ్చరికలు చేస్తున్నారు. విడాకులు తీసుకున్న పురుషుల్లో దాదాపు సగం మంది విడాకుల తర్వాత తమపై పడే ఆర్థిక భారాన్ని ముందుగా అంచనా వేయలేకపోతున్నారని ఈ సర్వే పేర్కొంది. కోర్టు ఫీజులు, లాయర్ ఖర్చులు, భరణం, పిల్లల నిర్వహణ ఖర్చులతో ఈ భారం భారీగా పెరుగుతోందని తెలిపింది.ఈ సర్వే పాల్గొన్న ఒక వ్యక్తి తన 7 ఏళ్ల న్యాయ పోరాటానికి సుమారు రూ.89 లక్షల వరకు ఖర్చు అయిందని.. దీనివల్ల మానసికంగా, ఆర్థికంగా తాను పూర్తిగా కుంగిపోయానని తెలిపారు. ఇటీవలి కాలంలో విడాకుల సమయంలో భరణం మొత్తాన్ని పెంచుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచుతున్నాయని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మన దేశంలో మొత్తం విడాకుల రేటు దాదాపు 1 శాతం వద్ద తక్కువగానే ఉన్నప్పటికీ.. బెంగళూరు, ఢిల్లీ, ముంబై వంటి పట్టణ ప్రాంతాల్లో గత కొన్నేళ్లలో విడాకుల కేసులు 30 నుంచి 40 శాతం పెరిగినట్లు తెలుస్తోంది.బాంబే హైకోర్టు, ఫ్యామిలీ కోర్టులో లాయర్ అయిన అదితి మోహోని భార్యాభర్తల జీవితంలో వచ్చే ఆర్థిక నష్టాన్ని నివారించడానికి లేదా దాన్ని తగ్గించడానికి కొన్ని కీలక సూచనలు చేశారు. పెళ్లికి ముందు భార్యాభర్తలు ఇద్దరూ స్పష్టమైన ఆర్థిక నియమాలను ఏర్పరచుకోవాలని.. వాటిని డాక్యుమెంట్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఆదాయాన్ని ఎలా పంచుకోవాలి అనేదానిపై నిర్ణయం తీసుకుని జాయింట్ అకౌంట్ ఓపెన్ చేయాలని సూచించారు. భార్యాభర్తల్లో ఒకరు ఉద్యోగం చేయకుండా ఇంట్లోనే ఉంటే.. వారి పేరు మీద ఆస్తులు లేదా బీమాను సృష్టించాలని తెలిపారు విడాకుల సమయంలో ఆస్తులు, అప్పులు, ఆదాయం, భరణం, పిల్లల పోషణకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని, రికార్డుల కాపీలను భద్రపరుచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. హక్కులను కాపాడుకోవడానికి, సాఫీగా మారడానికి ఫ్యామిలీ లాయర్ లేదా ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవాలని పేర్కొంటున్నారు. ఆర్థిక విషయాల్లో భార్యాభర్తలిద్దరూ ముందే ఒక అభిప్రాయానికి వస్తే.. తర్వాత ఎదురయ్యే ఒత్తిడిని నివారించవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. విడాకులకు సంబంధించిన న్యాయ ప్రక్రియలను ప్రారంభించడానికి ముందే కనీసం 6 నెలల ఖర్చులకు సరిపడా డబ్బును సిద్ధం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇది లీగల్ ఫీజులు, అద్దె, రోజువారీ ఖర్చులకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు.

# గ్రామాల్లో ఎన్నికల సందడి




**జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 3:**
ప్రాదేశిక ఎన్నికలు మహబూబా బాద్ జిల్లాలో రెండు దశల్లో నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలతో గ్రా మాల్లో స్థానిక ఎన్నికల సందడి నెలకొంది. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 18 జెడ్పిటిసి స్థానాలు, 193 ఎంపీటీసీ స్థానాలకు రెండు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో జిల్లాలో ఉన్న అధికారులు, పోలీసు బందోబస్తు, ఇతర అవస రాల ప్రాతిపదికన నేపథ్యంలో రెండు విడుదల ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. మొదటి విడతలు 9 జడ్పిటిసి స్థానాలు, వాటి పరిధిలో ఉన్న 104 ఎంపీటీసీ స్థానాలకు, రెండవ విడత 9 జడ్పిటిసి స్థానాలు, వాటి పరిధిలో ఉన్న 89 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు చేపట్టారు.రెండు విడతల్లో జరిగే ఎన్నికలకు బందోబస్తు, సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు పూర్తి చేశారు. 18 జెడ్పిటిసి స్థానాలు, 193 ఎంపీటీసీ స్థానాలకు 1,066 పోలింగ్ కేంద్రాలను ఇప్పటికే ఖరారు చేశారు. మొత్తం 5,56,780 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించాల్సి ఉండగా, 24 మంది రిటర్నింగ్ అధికారులను, 22 మంది అసిస్టెంట్ రిటర్న్ అధికారులను నియమించారు.అలాగే 1,279 మంది పోలింగ్ అధికారులను, 5,858 పోలింగ్ సిబ్బందిని నియమించారు. నామినేషన్ల స్వీకరణకు క్లస్టర్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 142 మంది ఆర్వో, ఏఆర్వోలను నియమించారు. 12 మంది జిల్లాస్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమించి వివిధ విభాగాల పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు.

**మొదటి ఎన్నికలు జరిగే మండలాలు**

బయ్యారం, చిన్న గూడూరు, దంతాలపల్లి, గార్ల, గూడూరు, మహబూబాబాద్, నరసింహులపేట, పెద్ద వంగర, తొర్రూరు ఉన్నాయి. అక్టోబర్ 10 నుండి నామినేషన్ల స్వీకరణ, 23వ తేదీన ఉదయం 7 నుండి సాయంత్రం 5 వరకు పోలింగ్ నిర్వహిస్తారు.

**రెండో దశ ఎన్నికలు జరిగే మండలాలు**

డోర్నకల్, గంగారం, ఇనుగుర్తి, కేసముద్రం, కొత్తగూడ, కురవి, మరిపెడ, నెల్లికుదురు,సిరోలు మండలాలు. అక్టోబర్ 13 నుండి నామినేషన్ల స్వీకరణ, 27వ తేదీ ఉదయం 7 నుండి సాయంత్రం 5 వరకు పోలింగ్ నిర్వహిస్తారు.

**ఎన్నికలు నిర్వహిస్తారా?**


స్థానిక పోరుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసినప్పటికీ ఎన్నికలు జరుగుతాయా లేదా అన్న అనుమానాలు సర్వత్ర వ్యక్తం అవుతున్నాయి. రిజర్వేషన్ల అమలులో న్యాయపరమైన చిక్కులు తొలగిపోతాయా, ఎన్నికలు నిర్వహిస్తారా లేదా అన్న అంశం ఈనెల 8న స్పష్టమయ్యే అవకాశాలు ఉన్నాయని, ఆ తరువాతే పోటీ వ్యవహారం చూద్దామని ఆలోచనలో వివిధ పార్టీల నాయకులు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.అయితే మరోవైపు ఇప్పటికే ప్రకటించిన రిజర్వేషన్ల ప్రకారం జడ్పిటిసి, ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేయడానికి చాలామంది నేతలు సన్నాహాలు ప్రారంభించారు. అయితే చాలా చోట్ల తమకు అనుకూలంగా పోటీ చేయడానికి రిజర్వేషన్లు అనుకూలించకపోవడంతో నిరాశకు లోనవుతున్నారు.

**బీసీలకు పెద్దపీట**

మహబూబాబాద్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కొత్తగా ప్రవేశపెట్టిన 42 శాతం బీసీల రిజర్వేషన్ల వల్ల ఈసారి జడ్పిటిసి, ఎంపీపీ స్థానాల్లో బీసీలకు పెద్దపీట లభించింది. 2019లో 16 ఎంపీపీ, 16 జెడ్పిటిసి స్థానాలు ఉండగా బీసీలకు ఎంపీపీ స్థానాల్లో ఒక్కటి కూడా కేటాయించలేదు.ఇప్పుడు జరగబోయే ఎన్నికల్లో ఆరు స్థానాలు కేటాయించారు. అలాగే 2019లో జరిగిన జెడ్పిటిసి ఎన్నికల్లో బీసీలకు ఒక్క స్థానం కూడా కేటాయించకపోగా ఇప్పుడు ఏడు స్థానాలను కేటాయించడంతో బిసి వర్గాల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

# ఐదు దశాబ్దాల రైతుల కల నెరవేర్చాలి

- ముల్కనూర్ వద్ద ప్రతిపాదిత స్థలంలోనే మున్నేరు ప్రాజెక్టు నిర్మించాలి
- మున్నేరు ప్రాజెక్టు నిర్మించి ఏజెన్సీ గిరిజన ప్రాంతాలకు తాగు, సాగునీరు అందించాలి
- మున్నేరు ప్రాజెక్టు నిర్మాణం మండల ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుంది
- మున్నేరు నీటిని పాలేరుకు తరలించడం అన్యాయం





**జయభేరి, గార్ల, అక్టోబర్ 03:**

పూర్వపు ఖమ్మం జిల్లా, ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా, గార్ల మండలం, ముల్కనూర్ గ్రామం వద్ద మున్నేటిపై మున్నేరు ప్రాజెక్టు నిర్మించాలని ప్రజలు,రైతులు,అఖిలపక్ష పార్టీల నాయకులు కోరుతున్నారు. మున్నేరు ప్రాజెక్టు నిర్మాణం ద్వారా వ్యవసాయానికి నీరు అందుబాటులో ఉంటుంది. ఇది స్థానిక రైతుల ఆదాయాన్ని పెంచుతుంది. మున్నేరు ప్రాజెక్టు నిర్మాణం గార్ల మండల ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుంది. 1969లో అప్పటి ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య రూ. ఒక లక్ష రూపాయల నిర్మాణ వ్యయంతో చంద్రగిరి ప్రాజెక్టుగా నామకరణం చేసి సర్వే ప్రారంభించారు.1985 లో తెలుగు దేశం ప్రభుత్వం పాకాల యేరు, బయ్యారం పెద్ద చెరువు అలిగేరును కలిపి రెండేర్లగడ్డ ప్రాజెక్టుగా నామకరణం చేసి రు.10 లక్షల రూపాయలకు పెంచి సర్వే చేపట్టారు. పది సంవత్సరాల అనంతరం తిరిగి మున్నేరు ప్రాజెక్టుగా పేరు మార్చుతూ నిర్మాణ ఖర్చులను కోటి రూపాయలకు పెంచుతూ సర్వే చేపట్టారు. మండల ఏజెన్సీ ప్రజల ఉద్యమ ఫలితంగా 2009లో స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం రూ.136 కోట్ల నిధులతో మధ్య తరహా ప్రాజెక్టుగా ప్రతిపాదించారు. జీవో నెంబర్ 1076 ప్రకారం రు. 36 కోట్లు ప్రాజెక్టు పనుల నిమిత్తం మంజూరు చేసిన ఆచరణ సాధ్యం కాలేదు.అప్పటి ఖమ్మం జిల్లాలోని గార్ల, బయ్యారం, కారేపల్లి,కామేపల్లి,ఖమ్మం రూరల్, వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్, కురవి, ములకలపల్లి, డోర్నకల్ తదితర ప్రాంతాలకు తాగు, సాగునీరు అందించాలని ఉద్దేశంతో ఈ ప్రాజెక్టు సర్వేను చేశారు. ఖమ్మం,వరంగల్ రెండు జిల్లాల్లోని సరిహద్దు గిరిజన ప్రాంతాల్లోని 56 రెవెన్యూ గ్రామాల 35 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని ఉద్దేశంతో సర్వే జరిపారు. అయినప్పటికీ ప్రాజెక్టు కోసం వేసిన శిలాఫలకాలు శిథిలమైపోయిన ప్రాజెక్టు నిర్మాణం చేయకపోవడం శోచనీయం. 50 సంవత్సరాలుగా ప్రభుత్వాలు మున్నేరు ప్రాజెక్టును పెండింగ్లో ఉంచి ఈ ప్రాంత ప్రజలకు తీరని అన్యాయం చేస్తూనే ఉన్నారు. మున్నేరు ప్రాజెక్టును జీవోలకు,సర్వేలకు పరిమితం చేసి ఏజెన్సీ, గిరిజన ప్రాంతాలకు సాగు ,తాగునీరు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టును ఏజెన్సీ,గిరిజన ప్రాంతాలకు రాకుండా చేయడమే కాక మున్నేరు నీళ్లను సైతం ఏజెన్సీ,గిరిజన ప్రాంతాలకు రాకుండా చేసే కుట్రలో భాగంగానే మున్నేరు నీటిని సీతారామ కెనాల్ ద్వారా పాలేరుకు తరలించడానికి జీవో నెంబర్ 98 ని విడుదల చేస్తూ 162 కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు పెట్టడానికి సిద్ధపడిందని ప్రజలు, అఖిలపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు.రు.100 కోట్ల రూపాయలతో మున్నేరు ప్రాజెక్టు నిర్మిస్తే గార్ల,డోర్నకల్, కారేపల్లి, కామేపల్లి, ఖమ్మం రూరల్ మండలాలకు సాగు తాగునీరు అందుతుంది. పాలక ప్రభుత్వాలు ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల పట్ల వివక్షపూరితమైన వైఖరి అవలంబిస్తున్నట్లు కనపడుతుంది. ఇప్పటికైనా జీవో నెంబర్ 98ను రద్దు చేసి, మున్నేరు ప్రాజెక్టు నిర్మించి ఏజెన్సీ గిరిజన ప్రాంతాలకు తాగు, సాగు అందించాలని ప్రజలు కోరుతున్నారు. 1969 నుండి 2009 వరకు గత పాలకులు చేపట్టిన సర్వేలను అనుసరించి అంచనా వేసి తప్పనిసరిగా ముల్కనూర్ వద్దనే మున్నేరు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని ప్రజలు, రైతులు, అఖిలపక్షం డిమాండ్ చేస్తుంది.



## దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ సర్పంచ్

**జయభేరి, తుర్కపల్లి, అక్టోబర్ 03:**

తుర్కపల్లి మండలం పల్లె పహాడ్ గ్రామంలో శ్రీ దుర్గా భవాని సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దుర్గ దేవి అమ్మవారిని గ్రామ మాజీ సర్పంచ్ సోక్కుల మోహన్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను బ్రహ్మశ్రీ రాళ్లబండి లంకేశ్వర చార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భవానీ మాత మాల వేసుకున్న స్వాములు దిలీప్ కుమార్ భవాని, అలువాల సతీష్ భవాని ,బాల నరసింహ భవాని, బన్నీ భవాని, సాయి భవాని, శశి కుమార్ భవాని, శ్రవణ్ కుమార్ భవాని, మహాలక్ష్మి మాత, వైష్ణవి మాత, ధరణి మాత, భవన మాత, గ్రామస్తులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బొల్లె బిక్షపతిని పరామర్శించిన చల్లా ధర్మారెడ్డి



**జయభేరి, పరకాల, అక్టోబర్ 03:**

కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ హాస్పటల్లో చికిత్స పొందుతున్న మాజీ జడ్పిటిసి బొల్లె బిక్షపతిని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను మాజీ ఎమ్మెల్యే కోరారు. బిక్షపతి కుటుంబానికి అండగా ఉంటామని చల్లా ధర్మారెడ్డి తెలిపారు. వారి వెంట పరామర్శించిన వారిలో మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.




## గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించిన పోలీసులు

**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి పూడూర్ గ్రామంలో గ్రామ నాయకులు దసరా జెండా ఆవిష్కరణ వివాదానికి పరిమితమై గాంధీ జయంతిని విస్మరించగా మేడ్చల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్ఐ యతీష్చంద్రలు,జర్నలిస్ట్ లక్ష్మణ్ యాదవ్ గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించారు. గ్రామంలో దసరా పండగా సందర్భంగా నిర్వహించి జెండా ఆవిష్కరణ రగడ సాగడంతో గ్రామ నాయకులు జెండా వివాదానికే పరిమితమై గాంధీ జయంతిని మరిచారు. ఉదయం 11.30 గంటలు అయినా గ్రామ నాయకులు గాంధీజీ వైపు కన్నెత్తి చూడకపోవడంతో గ్రామంలో దసరా బందోబస్తు పరిశీలనకు వచ్చిన ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, జర్నలిస్ట్ లక్ష్మణ్ యాదవ్,ఎస్ఐ తో కలిసి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పోలీసులు గాంధీజీకి నివాళులు అర్పించడం చూసిన పలువురు నాయకులు అనంతరం గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించారు.

## పేదరికాన్ని తరిమికొట్టేది విద్య ఒక్కటే

- ఆహ్లాదకరమైన వాతావరణంలో స్టడీ హాల్ ఏర్పాటు
- ఎస్వీఆర్ స్టడీ హాల్ ను ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

**జయభేరి, షాద్ నగర్, అక్టోబర్ 03 :**

పేదరికాన్ని తరిమికొట్టేది విద్య ఒక్కటే. పోటీ ప్రపంచంలో రాణించాలంటే మెరుగైన విద్య అభ్యసించడం తప్పనిసరి అని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు. షాద్ నగర్ పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో రవీందర్ రెడ్డి నూతనంగా ఏర్పాటుచేసిన ఎస్వీఆర్ స్టడీ హాల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ; విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టడానికి, ఒత్తిడి తగ్గించుకోవడానికి, తమ అధ్యయనాలను మెరుగు పరుచుకోవడానికి స్టడీ హాల్ ఉపయోగించుకోవాలని అన్నారు. పరిగెడుతున్న పోటీ ప్రపంచంలో ఉన్నతమైన విద్యను అభ్యసిస్తూ అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు అన్ని రంగాలలో రాణించి ఉన్నత ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలనిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్టిసి కాలనీ మాజీ కౌన్సిలర్ బీఎస్ సుధీర్,మాజీ కౌన్సిలర్లు రేటికల్ నంధీశ్వర్,ఈశ్వర్ రాజు,వెంకట్రాం రెడ్డి,కానుగు అనంతయ్య,బచ్చలి నరసింహ,మానస యాదగిరి నాయకులు సుమదిర్ బబ్లు,బంక్ శ్రీనివాస్ రెడ్డి,నిజాం,నరేష్, మల్లేష్,సంతోష్ యాదవ్,రఘు, అజ్జు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## నిధుల వర్షం కురిపించిన ఎమ్మెల్యే శంకర్

- రేగడి చిలకమర్రి నుండి రామచంద్రపురం వరకు అభివృద్ధికి 10 కోట్ల రూపాయల ప్రతిపాదన
- వీటిలో ఇప్పటికే మంజూరైన అత్యధిక నిధులు.. మిగతావి అతి త్వరలో మంజూరు..
- అతి త్వరలో రేగడి చిలకమర్రి గ్రామానికి సంబంధించిన అన్ని లింకు రోడ్లు బిటి రోడ్లుగా మారుస్తాం
- పురుషోత్తం రెడ్డి జితేందర్ రెడ్డిని అభినందించిన ఎమ్మెల్యే శంకర్



**జయభేరి, షాద్ నగర్, అక్టోబర్ 03 :**

దేవీ నవరాత్రులను పురస్కరించుకొని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన కొందుర్గు మండలం రేగడి చిలకమర్రి గ్రామ ప్రజలు. గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు జితేందర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే శంకర్ స్వగృహంలో శుభాకాంక్షలు తెలిపారు. పండగ శుభ సందర్భంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రేగడి చిలకమర్రి నుండి రామచంద్రపురం వరకు అభివృద్ధికి 10 కోట్ల రూపాయలు ప్రతిపాదించారు.

**జితేందర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి పాత్ర కీలకం అన్న ఎమ్మెల్యే శంకర్**

తన దగ్గరికి ఏ సందర్భంలో కలవడానికి వచ్చిన చిలకమర్రి మరియు మండల అభివృద్ధి కోసమే మాట్లాడుతారని, నేను ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలో కూడా నాకోసం నిరంతరం శ్రమించి గ్రామ ప్రజలందరినీ ఏకం చేసి గ్రామ ప్రజలందరితో కలిసిమెలిసి ఉంటూ ప్రతి సమస్యను నా దృష్టికి తీసుకొచ్చి అభివృద్ధి కావాలని నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. రేగడి చిలకమర్రి గ్రామానికి అన్నివేళలా అండగా ఉంటానని గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయడానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానని ఎమ్మెల్యే శంకర్ హామీ ఇచ్చారు. పండగ వాతావరణం లో గ్రామానికి నిధుల వర్షం కురిపించినందుకు గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తల్లి భారతి సేవలో వందేళ్లు

- గుండ్లపోచంపల్లి లో కాషాయ భగవత్ ధ్వజం ఆవిష్కరణ



**జయభేరి, మేడ్చల్ :**

క్రమశిక్షణ, అంకితభావంతో దేశానికి సేవ చేసే గొప్ప సంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సంస్థ అని బీజేపీ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ళ విక్రమ్ రెడ్డి అన్నారు. గురువారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ లో ఆర్ఎస్ఎస్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బ్రాహ్మణ పురోహితులు బాబు కాషాయ భగవత్ ధ్వజాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ, సేవ, జాతీయత మొదలైన అంశాలలో అద్భుతమైన నిబద్ధతను చూపిన ఆర్ఎస్ఎస్ పవిత్రమైన విజయదశమి రోజున వంద అద్భుతమైన సంవత్సరాలు పూర్తి చేసుకోవడం గొప్ప విషయమని అన్నారు. సేవను ప్రతిబింబించే లక్షణం ప్రతి స్వయంసేవకుడిలో ఉంది. ఈ చారిత్రాత్మక శతాబ్ది సందర్భంగా ప్రతి స్వయంసేవకుడికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్, మాజీ ఎంపిటిసి ఉషిగారి శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షుడు కావేరి శ్రీధర్, కిషన్,రామారావు తదితరులు పాల్గొన్నారు.

# సరదా పాటలు.. దాండియా ఆటలు

- గుండ్లపోచంపల్లి లో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ ఈటల రాజేందర్




**జయభేరి, మేడ్చల్ :**

దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గుండ్లపోచంపల్లి లో ఏర్పాటు చేసిన దుర్గామాత ను శుక్రవారం అమ్మవారిని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఎంపీ ఈటల ను శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురాగ్యాలతో ఉండాలన్నారు. అనంతరం ప్రజలందరికి దసరా పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ రోజు ప్రజలకు అన్నింటా శుభం చేకూరాలన్నారు. అంతకు ముందు దసరా పండుగను పురస్కరించుకుని దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దాండియా ఉత్సాహంగా సాగింది. దాండియాలో భవనీ దీక్షాపరులతో పాటు భక్తులు, మహిళలు, యువత రెట్టించిన భక్తి ఉత్సాహంతో అమ్మవారిని స్మరిస్తూ దాండియా ఆడుతున్నారు. బతుకమ్మ, జనపథ, డిజె పాటలకు అమ్మాయిలు చేసిన కోలాటం అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ళ విక్రమ్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, అమరం సరస్వతీ, మాజీ ఎంపిటిసి ఉషిగారి శ్రీనివాస్ ముదిరాజ్, మున్సిపల్ అధ్యక్షుడు కావేరి శ్రీధర్ ముదిరాజ్, నాయకులు కిషన్, మలిగే అశోక్, సురేష్, మధుసూదన్ రెడ్డి, సుంకు నవీన్, బట్టికడి విక్రమ్, ముక్కిడిగాళ్ళ మహేష్, వాసుదేవ్ రెడ్డి, వసంత్ రెడ్డి, మలిగే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## మాజీ మంత్రి మల్లారెడ్డికి దసరా శుభాకాంక్షలు



**జయభేరి, మేడ్చల్ :**

మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చమకూర మల్లారెడ్డి ని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ బిఆర్ఎస్ నాయకులు దొడ్ల మధుసూదన్, యాదవ సంఘం అధ్యక్షుడు ఉని గొర్ల రాము యదవ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మల్లారెడ్డిని శాలువతో సన్మానించి దసరా పండగ శుభాకాంక్షలు తెలియజేశారు.

# నాగులపల్లిలో కన్నుల పండుగగా అమ్మవారి ఊరేగింపు

- ఊరేగింపు కార్యక్రమంలో భారీ సంఖ్యలో పాల్గొన్న గ్రామ ప్రజలు
- ఇంటింటికి అమ్మవారి ప్రసాదం పంపిణీ చేసిన ఆలయ కమిటీ సభ్యులు

**జయభేరి, షాద్ నగర్, అక్టోబర్ 03 :**



కన్నుల పండుగగా దేవీ నవరాత్రుల సంబరాలు. దుర్గా భవాని మాతను ప్రతిష్టించి పదకొండు మంది స్వాములు అమ్మవారి మాల ధరించి అమ్మవారికి నవ రాత్రులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. గ్రామంలోని ప్రతి ఒక్కరు దుర్గాభవాని పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొంది తీర్థ ప్రసాదాలు తీసుకొని వారి ముక్కులు చెల్లించుకుంటారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం నాగులపల్లి గ్రామంలో శుక్రవారం శ్రీ దుర్గా భవాని అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఇంటింటికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం అమ్మవారి యొక్క ముక్కుపుడక, నవరాత్రులు పూజలు అందుకున్నటువంటి చీరలు వేలం వేశారు. వేలంపాటలు పోటాపోటీగా భక్తులు పాల్గొని అమ్మవారి ముక్కుపుడక చీరలు సొంతం చేసుకున్నారు. వేలంపాటి అనంతరం అమ్మవారి ముందు ఆటపాటలతో కోలాటం నృత్యాలు, బతుకమ్మ పాటలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ; ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా అమ్మవారిని ప్రతిష్టించి నవరాత్రుల సంబరాలు చేసుకుంటామని దుర్గా భవాని మొదటి రోజు నుండి ఆఖరి రోజు వరకు ప్రత్యేక పూజ కార్యక్రమాలకు భారీ స్థాయిలో ప్రజలు పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు, మహిళలు, గ్రామ యువకులు, తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రీన్ డాబా రెస్టారెంట్ ను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని ముదిగొండ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రీన్ రెస్టారెంట్ ,లాడ్జినీ నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రీన్ రెస్టారెంట్ ,లాడ్జి యజమానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన ఆహారం అందించాలని కోరారు. ప్రతి ఒక్కరూ స్వయం శక్తితో ఎదగాలని అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ గారిని గ్రీన్ రెస్టారెంట్ , లాడ్జి యజమాన్యం సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చింతపల్లి సుభాష్, యువజన విభాగం కొండమల్లెపల్లి మండల అధ్యక్షుడు రమావత్ తులసిరామ్, శ్రీనివాస్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## రావణ సంహార దహన కార్యక్రమం




**జయభేరి, దేవరకొండ :**

అధర్మంపై ధర్మం యొక్క విజయానికి ప్రత్యేకగా విజయదశమి రోజున రావణ సంహార దహన కార్యక్రమం గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల యందు నిర్వహించబడినది. ధర్మానికి ప్రత్యేక అయిన శ్రీరామచంద్రుడు సమస్త భారతీయులందరికీ ఆదర్శ పురుషుడు సమాజంలోని లోక కంటకులైన రావణాసురుడు మరి ఇతర అనేక రాక్షసులు మునులు సాధువులు రకరకాలుగా హింసించిన రాక్షసులను కడతెరిచిన పుణ్య పురుషుడు శ్రీరామచంద్రుడు రావణ సంహార దహన కార్యక్రమం ప్రతి సంవత్సరం దేవరకొండలో అధిక జనాభా మధ్య ఘనంగా జరుగుతుంది ఈ సంవత్సరం కూడా అత్యధికంగా ప్రజలు పాల్గొన్నారు ప్రతి సంవత్సరం రావణ సంహార కార్యక్రమం వేలంపాట ద్వారా దక్కించుకుంటారు గత సంవత్సరం వేలంపాట 4,20,116/గా ఉండే ఈ సంవత్సరం వేలం పాట 5,10,116/ గా కొండ్ర మల్లేశ్వరి శ్రీశైలం యాదవ్ (మాజీ కౌన్సిలర్) దక్కించుకున్నారు ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని దహన కార్యక్రమాన్ని ఉత్సాహంగా తిలకించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు బాలు నాయక్ వివిధ నాయకులు దేవరకొండ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ గార్డెన్ హోటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని ముదిగొండ X రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన గ్రీన్ గార్డెన్ హోటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై, గ్రీన్ గార్డెన్ హోటల్ ను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు వెదిరె మేఘా రెడ్డి తో కలిసి ప్రారంభించి, హోటల్ యజమానికి శుభాకాంక్షలు తెలిపిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు వెదిరె మేఘా రెడ్డి, మాజీ ఎంపీపీలు జాని యాదవ్,బిక్కు నాయక్, కాంగ్రెస్ నాయకులు YS కరుణాకర్, జైరామ్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవి మహిళల ప్రత్యేక పూజలు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించినారు. సాయంత్రం మణికంఠ గురూజీ ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి కీర్తనలు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కీర్తనలు గంగా హారతి ఆలయ ప్రధాన అర్చకులు ఘంటసాల సుబ్రమణ్య శర్మ వారి శిష్య బృందం చే వైభవంగా నిర్వహించినారు. ఆలయ అధ్యక్షులు చీదెళ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రేపు జరగబోయే శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి శోభాయాత్రను దేవరకొండ పట్టణ ప్రజలు అందరూ భక్తిశ్రద్ధలతో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరినారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షులు పానగంటి మల్లయ్య, అధ్యక్షులు చీదెళ్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సముద్రాల ప్రభాకర్, కోశాధికారి కొత్త సుబ్బారావు ఆర్యవైశ్య సంఘ సభ్యులు, వాసవి మహిళ సంఘ సభ్యురాలు తదితరులు పాల్గొన్నారు.

# యంగ్ మెన్స్ దుర్గా దేవి లక్కీ లాటరీ విజేతలకి బహుమతులు అందజేత

**జయభేరి, పరవాడ :**



పరవాడ గ్రామంలో యంగ్ మెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గా దేవి లక్కీ లాటరి యొక్క డ్రా బుధవారం పరవాడ సంత బయల పబ్లిక్ స్టేజ్ పై గ్రామ పెద్దలు, గ్రామ ప్రజల సమక్షంలో లాటరి డ్రా తియ్యడం జరిగింది. ఈ కార్యక్రమంకి కార్యక్రమంకు ముఖ్య అతిధిలుగా పరవాడ గ్రామ మాజీ సర్పంచ్ చుక్కా రాము నాయుడు ,వైకాపా రాష్ట్ర కార్యదర్శి,గ్రామ ఎంపీటీసీ పైల శ్రీనివాసరావు పాల్గొన్నారు.ఈ యొక్క లక్కీ లాటరి విజేతలు వరుసగా 1వ బహుమతి 43" టీవీ, బండారు అప్పారావు,2వ బహుమతి ఫ్రిజ్ శీర గంగమ్మ,3 వ బహుమతి వాషింగ్ మిషన్ నిహంత్, 4వ బహుమతి - సైకిల్, ద్వారపూడి సంతోష్,5వ బహుమతి వైట్ గ్రైండర్ శివాని ట్రేడర్స్, 6వబహుమతి డ్రెస్సింగ్ టేబుల్ సురేష్ గండి,7వ బహుమతి రైస్ కుక్కర్ రెడ్డి గుణ వీక్షిక,8వ బహుమతి మీక్సీ గండి లోకేశ్వరరావు,9వ బహుమతి డిన్నర్ సెట్ ఏ భువన దేవాన్ష్,10వ బహుమతి దుర్గ ఫొటో, చీర జాకెట్ రెడ్డి రాధా కృష్ణ.అలాగే 5 కన్సొలేషన్ బహుమతులకి 5గురు విజేతలను డ్రా తియ్యడం జరిగింది.

ఈ కార్యక్రమంలో పరవాడ మాజీ ఉప సర్పంచ్,వార్డు మెంబెర్స్ పోతల అప్పలనాయుడు, గండి ఈశ్వరరావు,టీడీపీ నాయుకులు పైల రామ చంద్రరావు,బీజేపీ నాయుకులు గండి నోమోబాబు,అసోసియేషన్ సీనియర్ సభ్యులు రొంగలి అప్పలనాయుడు,పరవాడ జగదీష్, గండి సత్యనారాయణ,గండి శ్రీనివాసరావు,గండి లోకేశ్వరరావు, కసిరెడ్డి అప్పలరాజు,రెడ్డి నారాయణరావు,చుక్కా అప్పలనాయుడు, మాజీ పాల సొసైటీ అధ్యక్షులు కుండ్రాపు చిన బాబు,గండి వెంకట రావు,కసిరెడ్డి అప్పలరాజు, రాజాన సత్యం,బానోత్ బలరామ్,చుక్కా నోమో,బొడ్డు బుజ్జి,గండి సురేష్,పిల్లా జగదీష్, చుక్కా మధు సుధన్ ,బండారు ఆనంద్,గండి రాఘవ,గండి అప్పారావు,గండి చంద్ర రావు ,ద్వారపూడి శ్రీనివాస్,తేలు రమణజీ,బొడ్డు శ్రీధర్,కర్రీ మహేష్ మరియు అధిక సంఖ్యలో ప్రజలు,మహిళలు పాల్గొన్నారు.



## శ్రీ దేవీ నవరాత్రి ఉత్సవాలు

- BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నాయక్

**జయభేరి, చందంపేట :**

చందంపేట మండలం కేంద్రంలో కొలువైన శ్రీ దేవీ నవరాత్రి ఉత్సవాలు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించిన BRS_ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నాయక్ BRS_ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్నాయక్ నీ శాలువాతో సత్కరించారు ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునర్దించాలి

- సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గని శెట్టి డిమాండ్

**జయభేరి, పరవాడ:**



పరవాడ మండలం తానం గ్రామంలో గల భవన నిర్మాణ కార్మికుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునర్దించాలని డిమాండ్ చేశారు. సుమారు 7 సంవత్సరాలుగా సంక్షేమ బోర్డులో కార్మికులకు అందాల్సినటువంటి పథకాలను అమలు చేయలేదన్నారు. గత వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిలిపివేస్తూ 12,14 మెమోను జారీ చేసి, ఇసుక కొరత, కరోనాకాలం,నోట్ల రద్దు, కష్టకాలంలో కార్మికులు ఏ రకంగా మోసం చేసిందో. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా సంక్షేమ పథకాలు అందిస్తామని ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, కూటమి ప్రభుత్వం కూడా కార్మికులను మోసగిస్తుందని ఆరోపించారు.

కోట్లాది రూపాయలు సంక్షేమ బోర్డులో ఉంటున్న ప్రభుత్వ అవసరాలకు ఉపయోగిస్తుంది తప్ప సంక్షేమ బోర్డులో సభ్యులుగా ఉన్న 32 రకాల నిర్మాణ కార్మికులకి ఎటువంటి సహాయం అందించలేదని అన్నారు. ఈ ఏడేళ్ల కాలంలో అనేకమంది కార్మికులు ప్రమాదాల కి గురై వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి అన్నారు. కార్మికులు పోరాడితే తప్ప సంక్షేమ బోర్డుని కాపాడుకోలేని పరిస్థితి దాపురించింది అన్నారు .ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి. చిరంజీవి, జి. సన్యాసిరావు, రొంగలి. కన్నం నాయుడు, పి.వీర్ నాయుడు, తిరునాద్, అప్పారావు, శ్రీను, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## జల్సా ఏ సిరతున్ నబి

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ సామూహిక వివాహల కోసం ఏర్పాట్లు పూర్తి ఈద్గా కమిటీ మదర్సా మిస్బా ఉల్ ఉలుమ్, ఇస్లాహే ముఆష్రా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 5న ఆదివారం దేవరకొండ పట్టణంలోని స్థానిక అఖ్సా మస్జిద్ లో జరిగే 35వ జల్సా ఏ సీరతున్ నబీ సభ కు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయని ఈద్గా కమిటీ అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు సయ్యద్ అజీముద్దీన్, మహ్మద్ ఇలియాస్ పటేల్ లు పేర్కొన్నారు. శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వారు మాట్లాడుతూ ఆదివారం జరగబోయే ఈ యొక్క జల్సా లో సామూహిక వివాహాలు జరుగుతాయని వెల్లడించారు. దాదాపు నగరం నుండి మూడు వేల మంది హాజరయ్యే ఈ జల్సాకు స్థానిక అఖ్సా మస్జీద్ (చిన్న దర్గా) లో ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్, నల్గొండ, వరంగల్ తదితర ప్రాంతాల నుండి ముఖ్య అతిథులుగా.. హజ్రత్ మౌలానా మహ్మద్ అబ్దుల్ రహీం బ నయీమ్ సాబ్, హజ్రత్ మౌలానా ముఫ్తి సయ్యద్ అంజద్ అలీ ఖాస్మి సాబ్, హాఫిజ్ అబ్దుల్ అజీజ్ సాబ్, హజ్రత్ మౌలానా మహ్మద్ ఉమర్ అభిదీన్ ఖాస్మి సాబ్, హజ్రత్ మౌలానా ఎహ్సానోద్దీన్ సాబ్, హజ్రత్ మౌలానా నిజామోద్దీన్ సాబ్, నాజిమ్ జల్సా హజ్రత్ మౌలానా ఖవి సాబ్. ముఫ్తి జావీద్ హుస్సేన్ ఖాస్మి సాబ్... ప్రత్యేక ఆహ్వానితులుగా శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ హాజరవుతున్నట్లు తెలిపారు. జల్సాలో పాల్గొంటున్న మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి ఒక్కరికి భోజన ఏర్పాట్లుకల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పలు జంటలకు సామూహిక వివాహాలు జరుగుతాయని వెల్లడించారు, ఈ యొక్క జల్సాకు సహకరిస్తూ చేయూతనందిస్తున్న ప్రతి ఒక్కరికి కమిటీ తరపున ధన్యవాదాలు తెలిపారు. గౌరవ అధ్యక్షులు మహ్మద్ షబ్బీర్ అహ్మద్, ఉపాధ్యక్షులు మహ్మద్ సాలర్ ఖదీర్,మహ్మద్ షబ్బీర్,ఖాజా మైనొద్దీన్, సభ్యులు మహ్మద్ సలీం, సయ్యద్ దస్త గిర్, జామిన్ అలీ, ఎస్ కె బురాన్, మహ్మద్ షకీల్, యండి ముజీబ్, జాఫర్ ఖాన్, యండి అఫ్రోజ్, సయ్యద్ అజీజ్, ఎస్ కె ఇల్యాస్ బాబా, ఎస్ కె అజ్మత్, హమీద్, యండి నజీర్, ఖైసర్, ఇస్మాయిల్, షఫీఉల్లా, మంజూర్, ఖాలేఖ్, జాకీర్, ఖాజా, బారి తదితరులు పాల్గొన్నారు.

## చిత్స్వరూప!

తే.గీ. మనసులో శివ సంకల్ప మొనర జేసి
ప్రణవ జపమునే చేయంగ వలయు
సుమ్మి!
జ్ఞాన మన్నచో పరమాత్మ జ్ఞానమద్ది
చేరి కొలుతును నిన్ను నే చిత్స్వరూప!

ఆ.వె. దేహ వృక్ష మందు దేవుని తోడుగా
జీవ పక్షి యెపుడు చేరి యుండు
కనుక మిత్రు లగుచు కనిపింతు రిద్దరు
చేరి కొలుతు నిన్ను చిత్స్వరూప!

ఆ.వె. పరమ ఆప్తు డనగ పరమాత్ము డొక్కడే
అతి సమీపమందు నలరు చుండు
సుఖము లొసగు వాడు చూడగా దేవుడే
చేరి కొలుతు నిన్ను చిత్స్వరూప!

తే.గీ. సంచితము లైన కర్మలు సంచులందు
నింపుకొని వచ్చి జన్మించి శేషములతొ
తిరిగి జన్మమ్ము లెత్తగా తీరుచుండు
చేరి కొలుతును నిన్ను నే చిత్స్వరూప!

తే.గీ. సృష్టిలో తియ్యనైనది స్నేహమగును
ప్రేమ కంటెను స్నేహమే ప్రీతి యగును
సృష్టి నయ్యది మధురమ్ము చేయగలదు
చేరి కొలుతును నిన్ను నే చిత్స్వరూప!



జక్కని వేంకటరాజం
సిరిసిల్ల. 94400 21734



## విజయ్ దేవరకొండల రష్మికల సీక్రెట్ ఎంగేజ్మెంట్..

హీరో, హీరోయిన్లు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ప్రేమలో ఉన్నారని ఎప్పటినుంచో ప్రచారం జరుగుతోంది. అయితే వీరెప్పుడూ తమ ప్రేమ బంధం గురించి అధికారికంగా మాట్లాడలేదు. కానీ ఇద్దరి సోషల్ మీడియా పోస్టుల, ఫొటోస్ మాత్రం విజయ్‌రష్మికల డేటింగ్ ను చాలా సార్లు కన్ఫార్మ్ చేశాయి. ఫారిన్ టూర్లు, వెకేషన్ లు.. ఇలా ఎక్కడకు వెళ్లినా జంటగానే వెళ్లారు విజయ్ రష్మిక. అయితే వేర్వేరుగా ఫొటోలు షేర్ చేస్తూ ఇన్ డైరెక్టుగా తమ ప్రేమ విషయాన్ని బయట పెడుతున్నారీ లవ్ బర్డ్స్. ఇక సినీ అభిమానులు కూడా విజయ్‌రష్మికలు త్వరలోనే పెళ్లి చేసుకుంటారని అంచనా వేస్తున్నారు. ఇప్పుడు అదే నిజం కానుంది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నలు నిశ్చితార్థం చేసుకున్నారు. శుక్రవారం (అక్టోబర్ 03) ఉదయం విజయదేవరకొండ ఇంట్లోనే ఈ ప్రేమ పక్షులు ఉంగరాలు మార్చుకున్నారు. విజయ్ దేవరకొండరష్మిక ఎంగేజ్మెంట్ వేడుకకు కేవలం ఇరు కుటుంబసభ్యులు, అతికొద్ది మంది సన్నిహితులు మాత్రమే హాజరైనట్లు సమాచారం. ఇక వచ్చే ఏడాది ఫిబ్రవరిలో విజయ్‌రష్మికల పెళ్లి జరగనుందని సమచారం. చాలా మంది సెలబ్రిటీ ల్లాగే వీరు కూడా డెస్టినేషన్ వెడ్డింగ్ కు ప్లాన్ చేసినట్లు సమాచారం. అయితే అత్యంత గోప్యతతో ఈ ఎంగేజ్ మెంట్ వేడుకలను నిర్వహించినట్లు తెలుస్తోంది. అలాగే దీనిపై ఇప్పటివరకు ఇంకా అధికారిక ప్రకటన కూడా రాలేదు. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కలిసి గీత గోవిందం సినిమాలో నటించారు. అప్పటి నుంచే వీరి మధ్య మంచి అనుబంధం ఏర్పడింది. దీని తర్వాత డియర్ కామ్రేడ్ సినిమాలోనూ స్క్రీన్ షేర్ చేసుకున్నారీ లవ్ బర్డ్స్. ఈ రెండు సినిమాలతోనే వీరి మధ్య ప్రేమకు మంచి పునాది ఏర్పడిందని సమాచారం. కాగా విజయ్ దేవర కొండ, రష్మిక మందన్నాలు ఇప్పుడూ పాన్ ఇండియా స్టార్స్ గా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇటీవలే కింగ్ డమ్ సినిమాతో మరో హిట్ ను ఖాతాలో వేసుకున్నాడు విజయ్. మరోవైపు రష్మిక కూడా దక్షిణాది సినిమాలతో పాటు బాలీవుడ్ సినిమాలు కూడా చేస్తోంది.

## అటు విడుదల.. ఇటు ప్రారంభోత్సవం



అగ్ర కథానాయకుడు బాలకృష్ణ నటిస్తున్న డివోషనల్ యాక్షన్ ఎంటైర్టైనర్ 'అఖండ 2'. బ్లాక్ బాస్టర్ 'అఖండ'కు ఇది సీక్వెల్. బోయపాటి శ్రీను దర్శకుడు. రామ్ ఆచంట గోపీచంద్ ఆచంట నిర్మాతలు. డిసెంబర్ 5న పాన్ ఇండియా స్థాయిలో సినిమా విడుదల కానుంది. ఈ విషయాన్ని ప్రకటిస్తూ ఓ పోస్టర్‌ని కూడా మేకర్స్ విడుదల చేశారు. ఈ సీక్వెల్ ఓ గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించబోతున్నదని మేకర్స్ తెలిపారు. లాంగ్ హెయిర్, రగ్గడ్ బీర్డ్, రుద్రాక్షాభరణాలు, చేతిలో త్రిశూలం, గోధుమరంగు, కాషాయంతో కూడిన సంప్రదాయ దుస్తులు.. వీటన్నింటితో శక్తివంతుడైన అఘోరీగా ఈ పోస్టర్‌లో బాలకృష్ణ కనిపిస్తున్నారు. ఓ డివైన్ వైబ్‌ను జోడించేలా ఆయన లుక్ ఉంది. ప్రకాశవంతమైన మంచు పర్వతాల నేపథ్యం ఈ పోస్టర్‌కు స్పెషల్ అట్రాక్షన్. ఆది పినిశెట్టి, సంయుక్తమీనన్, హర్షాలి మల్హోత్రా ఇందులో కీలక పాత్రధారులు. తమన్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రాన్ని ఎం.తేజస్వినీ నందమూరి సమర్పిస్తున్న విషయం తెలిసిందే. ఇదిలావుంటే.. ఈ దసరా సందర్భంలోనే మలినేని గోపీచంద్ దర్శకత్వంలో తాను నటించబోతున్న సినిమాకు సంబంధించిన ప్రారంభ ముహూర్తాన్ని కూడా ప్రకటించేశారు బాలకృష్ణ. ఈ నెల 24న ఈ సినిమా ఓపెనింగ్ గ్రాండ్‌గా జరుగనున్నది. హిస్టారికల్ ఎపిక్ జానర్‌లో రూపొందనున్న ఈ సినిమాలో ఇంతకు ముందు చూడని కొత్త అవతారంలో బాలకృష్ణను చూపించనున్నామని మలినేని గోపీచంద్ తెలిపారు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



## సక్సెస్ అంటే ఈ అమ్మాడిదే..

బాహుబలిలో "మనోహరి" పాటకు డ్యాన్స్ అదరగొట్టింది. అలాగే తొలినాళ్లలో ఆమె తినడానికి కూడా తిండి లేదు. కానీ ఇప్పుడు ఆమె చాలా సంపాదిస్తోంది. సల్మాన్ ఖాన్, వరుణ్ ధావన్ వంటి స్టార్ హీరోలతో నటించింది. సినిమాలో 5 నిమిషాలు నటించినా కోట్లలో పారితోషికం తీసుకుంటుంది. నోరా ఫతేహి ఫిబ్రవరి 6, 1992న కెనడాలోని మాంట్రియల్‌లో జన్మించారు. చిన్నప్పటి నుంచి ఆమెకు సినిమాల్లో నటించాలనే కోరిక ఉండేది. అందుకే ఆమె భారతదేశానికి వచ్చింది. నోరా తన కెరీర్‌ను హిందీ చిత్రం 'రోర్: టైగర్స్ ఆఫ్ ది సుందర్‌బన్స్'తో ప్రారంభించింది. తరువాత, ఆమె 'బాహుబలి: ది బిగినింగ్' చిత్రంలో మనోహరి, 'టెంపర్' చిత్రంలో ఇట్టాగే రెచ్చిపోదాం.. వంటి పాటలతో పాపులర్ అయ్యింది. తాను ఇండియాకు వచ్చినప్పుడు కేవలం 5 వేలు మాత్రమే ఉన్నాయని.. తొమ్మిది మంది కలిసి 3BHK ఫ్లాట్ లో కలిసి ఉన్నామని చెప్పుకొచ్చింది. అప్పట్లో తన దగ్గర డబ్బులు కూడా లేవని.. తినడానికి తిండి లేకుండా ఇబ్బందిపడినట్లు గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. నోరా రోజుకు ఒక గుడ్డు, బ్రెడ్ మాత్రమే తినేదని. తాను సంపాదించిన డబ్బులో ఎక్కువ భాగం కళాకారులకు అవకాశాలు కొనే ఏజెంట్లు తీసుకునేవారని, వారు తనకు చాలా తక్కువ జీతం ఇచ్చారని ఆమె చెప్పింది. ఇప్పుడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్. నిత్యం ఏదోక పోస్ట్ చేస్తూ సందడి చేస్తుంటుంది.



## బ్లాక్ డ్రెస్‌లో అందాల సెగలు..

అందాల ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ అమ్మడు తన అంద చందాలతో ఎంతో మంది మదిని దోచుకుంది. తాజాగా ఈ బ్యూటీ బ్లాక్ డ్రెస్‌లో తన అంద చందాలతో అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. బుల్లితెరపై సీరియల్ ద్వారా మంచి ఫేమ్ సంపాదించుకున్న ఈ ముద్దుగుమ్మ తన క్యూట్‌నెస్‌తో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. సీరియల్ ద్వారా మంచి ఫేమ్ సంపాదించుకొని, సిల్వర్ స్క్రీన్ పైకి అడుగు పెట్టి తన నటనతో ప్రతి ఒక్కరి మనసు దోచుకుంది. సీతారామం మూవీతో టాలీవుడ్ అభిమానుల ఫేవరెట్ అయిపోయింది ఈ బ్యూటీ. ఈ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకొని వరసగా సినిమా ఆఫర్స్ అందుకుంది. తర్వాత ఫ్యామిలీ స్టార్, హాయ్ నాన్న పలు సినిమా చేసి తన కంటూ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. హాయ్ నాన్న సినిమాతో మంచి హిట్ అందుకున్న ఈ బ్యూటీ, ఫ్యామిలీ స్టార్ మూవీతో ఫ్లాప్ అందుకుంది. ఇక ఈ మూవీతో ఈ అమ్మడుకు ఆశించిన స్థాయిలో అవకాశాలు రాలేదు. దీంతో తెలుగులో అవకాశాలు తగ్గడంతో బాలీవుడ్ కోలీవుడ్ చక్కేసింది ఈ చిన్నది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ బ్యూటీ, తాజాగా బ్లాక్ డ్రెస్, తన అంద చందాలతో అందినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

## కామ్రేడ్ కళ్యాణ్‌గా శ్రీవిష్ణు



శ్రీవిష్ణు కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రానికి 'కామ్రేడ్ కళ్యాణ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వంలో వెంకటకృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్న ఈ చిత్రం టైటిల్ ప్రోమోను దసరా సందర్భంగా విడుదల చేశారు. 1992లో ఆంధ్ర, ఓడిశా సరిహద్దులోని విశాఖ జిల్లా మాడుగుల గ్రామం నేపథ్యంలో సాగే కథ ఇదని ప్రోమో చెబుతున్నది. ఇందులో నక్సలైట్ నాయకుడు కామ్రెడ్ కళ్యాణ్‌గా శ్రీవిష్ణు కనిపించారు. తన కోసం పోలీసులు విడుదల చేసిన 5 లక్షల రివార్డ్ వాంటెడ్ పోస్టర్‌ను తనే స్వయంగా అతికించడం ఈ ప్రోమోలో ట్విస్ట్. హ్యూమర్, యాక్షన్, రొమాన్స్, కలగలుపుగా ఈ సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. శ్రీవిష్ణు ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో మహిమా నంబియార్ కథానాయిక. రాధికా శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమయే కీలక పాత్రధారులు. ఇదిలావుంటే.. ఈ సినిమా నిర్మాణంలో ఉండగానే తన కొత్త సినిమాను కూడా పట్టాలెక్కించేశారు శ్రీవిష్ణు. తనకు బ్లాక్‌బాస్టర్ 'సామజవరగమనా'ను అందించిన రామ్ అబ్బరాజు దర్శకత్వంలో మరోసారి ఆయన నటించనున్నారు. దసరా సందర్భంగా ఈ సినిమాను గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ముహూర్తపు సన్నివేశానికి హీరో సాయిదుర్గతేజ్ క్లాప్ ఇచ్చి, స్క్రిప్ట్‌ను హీరో నారా రోహిత్‌తో కలిసి నిర్మాతలకు అందజేశారు. నరేశ్, వెన్నెలకిశోర్, సుదర్శన్, దర్శకులు వివేక్ ఆత్రేయ, హసిత్ గోలి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**